# మల్లె

**రకాలు :** మల్లెలో సాధారణంగా విడిమల్లె, దొంతరమల్లె, గుండుమల్లె మరియు బొడ్డుమల్లె తరహా పూల రకాలు కలవు.

**ప్రవర్ధనం :** కొమ్మ కత్తిరింపుల ద్వారా గాని, అంటు మొక్కలు తొక్కడం (లేయరింగ్) ద్వారా గాని ప్రవర్ధనం చేస్తారు.

**నాటటం :** మల్లె మొక్కలను తేలికపాటి నేలల్లో నాటాలి. జూన్–డిసెంబర్ వరకు ఎప్పుడైనా నాటవచ్చు. సాయంత్ర సమయాన నాటడం వలన మొక్క బాగా అతుకుతుంది. అంటు మొక్కలను వరుసల మధ్య మరియు మొక్కల మధ్య 1.25–2.00 మీటర్ల ఎడం ఉండేలా నాటుకోవాలి.

**కత్తిరింపులు :** మల్లె తోటలో లేత చిగుర్ల నుంచే పూలు వస్తాయి కాబట్టి ప్రతి సంవత్సరం ఆకును రాల్పడం మరియు కొమ్మ కత్తిరింపులు తప్పని సరిగా చేపట్టాలి. కొమ్మలు కత్తిరించడానికి 10–15 రోజుల ముందు నీరుకట్టడం ఆపేయాలి.

**నీటి యాజమాన్యం :** కొమ్మ కత్తిరింపుల తర్వాత నీరు కట్టటం వలన మొక్కలు కొత్తగా చిగురిస్తాయి. నేల స్వభావాన్ని బట్టి 8–10 రోజులకు ఒకసారి తడి ఇవ్వాలి. డ్రిప్ ద్వారా కూడ నీటి సదుపాయం కల్పించవచ్చు.

**ఎరువులు :** ప్రతి మొక్కకు 8–10 కిలోల పశువుల ఎరువుతోపాటు 60–120 గ్రా. నత్రజని,120గ్రా. భాస్వరం మరియు పొటాష్ ఎరువులను మొదటి కొమ్మ కత్తిరింపులు చేసిన వెంటనే వేయాలి. తదుపరి సూచించిన మోతాదును దఫాలుగా వేయటం మంచిది.

**దిగుబడి :** పూల దిగుబడి పెంచుటకు లీటరు నీటికి 2.5గ్రా.ల జింక్‌సల్ఫేట్, 5గ్రా.ల మెగ్నీషియం సల్ఫేటట్ సూక్ష్మ ధాతువులను కలిపి రెండు, మూడు దఫాలుగా పిచికారి చేయాలి. మొక్కలు నాటిన 6 నెలల తర్వాత పూత ప్రారంభమయి మొక్క పెరిగే కొద్దీ దిగుబడి అధికమవుతుంది. ఎకరానికి షుమారు 3–4 టన్నుల దిగుబడి పొందవచ్చు.

## సస్యరక్షణ

### పురుగులు

**మొగ్గతొలుచు పురుగు :** పురుగు యొక్క లార్వా, పువ్వు మొగ్గల్లోనికి చొచ్చుకొనిపోయి పూల భాగాలను తినివేస్తూ తీవ్రదశలో మొగ్గలన్నింటిని ఒక దగ్గరికి చేర్చి ముడుచుకుపోయేటట్లు చేస్తుంది. నివారణకు గాను మలాథియాన్ లేక ఎండోసల్ఫాన్ లీటరు నీటికి 2 మి.లీ. మందును కలిపి చెట్లపై పిచికారి చేయాలి.

**నల్లి :** ఈ పురుగు ఉధృతి పొడి వాతావరణంలో ఎక్కువగా వుంటుంది. పురుగులు ఆకు అడుగు భాగాన చేరి రసాన్ని పీల్చడం వలన ఆకులు పసుపు రంగుకు మారి రాలిపోతాయి. నివారణకు గాను గంధకపు పొడిని ఎకరాకు 8–10 కిలోల చొప్పున చల్లుకోవాలి.

### తెగుళ్ళు

**ఆకు ఎండు :** తెగులు ఆశించిన ఆకులు దళసరిగా మారుతాయి, ఆకు పై భాగంలో ఎరుపు రంగు మచ్చలు ఏర్పడతాయి. తీవ్రదశలో 50 శాతం వరకు దిగుబడి తగ్గుతుంది. నివారణకు మాంకోజెబ్ 3గ్రా. లేక కార్బండైజిమ్ 1గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**ఎండు తెగులు :** తెగులు తొలిదశలో మొక్క క్రింది భాగం ఆకులు ఎండిపోతాయి. అటు పిమ్మట పైభాగాన వున్న ఆకులు కూడా ఎండి రాలిపోతాయి. తీవ్ర దశలో మొక్కంతా ఎండి చనిపోతుంది. నివారణకు మొక్కల చుట్టూ కాపర్ ఆక్సీక్లోరైడ్ 3గ్రా. లీటరు నీటిలో కలిపి భూమిని తడపాలి.